జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 49 1-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## ఆర్టీసీ బస్సు-లారీ ఢీ.. 15 మందికి తీవ్ర గాయాలు

- సదాశివపేట చీఎ 65పై బైపాస్ రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదం
- ఆర్టీసీ బస్సు-లారీ ఢీ
- 15 మందికి తీవ్ర గాయాలు



2లో

## వేట్లపాలెంలో విస్ఫోటనం తీవ్ర దిగ్భ్రాంతికరం: పవన్ కల్యాణ్

- మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన పవన్ కల్యాణ్
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న ఉప ముఖ్యమంత్రి

2లో

## ఆ 5 గ్రామాలను తెలంగాణకు ఇచ్చేయండి: చంద్రబాబుకు సీపీఐ నారాయణ విజ్ఞప్తి

- ఈ ప్రతిపాదనకు చంద్రబాబు మానవత్వంతో అంగీకరించాలి
- భద్రాద్రి ఆలయానికి కనీస సౌకర్యాలు లేవని వ్యాఖ్య
- సామరస్యంగా సమస్యను ముగించాలని సూచన



# బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు

# 20 మంది సజీవ దహనం..

- 11 మందికి తీవ్ర గాయాలు
- ఆ సమయంలో మందు గుండు తయారీలో 3040 మంది వరకు కూలీల నిమగ్నం
- చెవులు చిల్లులు పడేలా ఏకధాటిగా రెండు గంటలపాటు పేలుళ్లు
- 2030 అడుగుల ఎత్తున ఎగిరిపడ్డ తలలు.. కాళ్లు.. చేతులు.. మొండేలు

కాకినాడ: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో భారీ విస్ఫోటనం సంభవించింది. సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ బాణసంచా తయారీ కేంద్రం శనివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో భారీ శబ్దంతో పేలిపోయి భస్మీపటలమైంది.

- మిగతా 2వ పేజీలో

### మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల ఆర్థిక సాయం

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్డీఓ డీఎస్పీ సహా నలుగురు అధికారుల సస్పెన్షన్
- బాణసంచా కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి
- నిబంధనలు ఉల్లంఘించే వారి ఆస్తులు జప్తు చేస్తామని సీఎం హెచ్చరిక
- బాధిత కుటుంబాల పిల్లలకు ఉచిత విద్య ఇళ్లు నిర్మించి ఇస్తామని భరోసా

2లో

# భగ్గుమన్న పశ్చిమాసియా

- ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా భీకర దాడులు
- దద్దరిల్లుతున్న టెహ్రాన్, ఇతర నగరాలు
- భారీగా క్షిపణులు, బాంబు దాడులు
- ఖమేనీ తదితరులే లక్ష్యంగా వేట
- పలువురు కీలక కమాండర్ల మృతి!
- స్కూలుపై దాడి, 85 మంది బలి
- మృతులు 200, క్షతగాత్రులు 700
- భారీగా ప్రతిదాడులకు దిగిన ఇరాన్
- ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్ల వర్షం
- అమెరికా గల్ఫ్ స్థావరాలపై దాడులు
- బహ్రెయిన్, యూఏఈ, ఖతర్,
- సౌదీ సహా ఆరేడు దేశాల్లో పేలుళ్లు

దుబాయ్: అమెరికా అన్నంత పనీ చేసింది. పశ్చిమాసియాను మరోసారి రణరంగంగా మార్చింది. మిత్ర దేశం ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై శనివారం భారీ స్థాయిలో దాడులకు దిగింది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'పేరిట అమెరికా, 'ఆపరేషన్ రోరింగ్ లయన్'పేరుతో ఇజ్రాయెల్ రణన్నినాదం చేశాయి. శనివారం ఉదయం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తో పాటు పలు ప్రాంతాలపై క్షిపణులు, బాంబు దాడులతో విరుచుకుపడ్డాయి. ముఖ్యంగా ఉత్తర టెహ్రాన్‌లో 30కి పైగా ప్రంతాలపై ఒకేసారి దాడులకు దిగాయి. ఇరాన్ నాయకత్వాన్నే లక్ష్యం చేసుకున్నట్టు ఇరు దేశాలూ ప్రకటించాయి. సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ (86), అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో పాటు ఇతర అగ్ర నేతలే లక్ష్యంగా దాడులు కొనసాగాయి. తొలి పేలుళ్లు ఖమేనీ, పెజెష్కియాన్ నివాసాలు, కార్యాలయాల సమీపంలోనే చోటుచేసుకున్నాయి. అప్పటికే ఖమేనీ, పెజెష్కియాన్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు ఇరాన్ వర్గాలు పేర్కొన్నా, పలువురు ఇరాన్ కీలక సైనిక కమాండర్లు, నేతలు దాడుల్లో మరణించినట్టు చెబుతున్నారు.

- మిగతా 2వ పేజీలో



# అది ముస్లిం లీగ్‌మావోయిస్టు కాంగ్రెస్

- కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం
- రాజస్తాన్‌లో అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం
- హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌కు శ్రీకారం





# మార్చి 6 నుంచి 99 రోజుల ప్రణాళిక

- గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు...
- పౌర సేవలను సులభతరం చేసేలా సాంకేతిక సంస్కరణలు
- సంస్కరణల కోసం సీనియర్ ఐఏఎస్ జయేశ్ ఆధ్వర్యంలో కమిటీ
- ఐఏఎస్ అధికారులే ప్రభుత్వానికి వెన్నెముక
- 4న కలెక్టర్ల సమావేశంలో అందరి పనితీరుపై మాట్లాడతా
- జూన్ 2న తెలంగాణ పండుగ ఘనంగా జరుపుకోవాలి
- కార్యదర్శుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో

# మాటలకే పరిమితం కాకుండా గ్రౌండింగ్‌కే మా ప్రాధాన్యత

- అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.2,300 కోట్ల పెట్టుబడితో బ్లూ జెట్ హెల్త్ కేర్ పరిశ్రమ ఏర్పాటు
- ఉత్తరాంధ్ర పారిశ్రామికాభివృద్ధిలో ఇది కీలక మైలురాయిగా అభివర్ణించిన మంత్రి లోకేశ్
- పరిశ్రమ ద్వారా 1,750 మందికి ప్రత్యక్షంగా, 250 మందికి పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు
- దేశంలోనే ప్రముఖ ఔషధ తయారీ కేంద్రంగా ఏపీని తీర్చిదిద్దే దిశగా అడుగులు
- వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ఏకైక అజెండాగా ప్రభుత్వం పని చేస్తోందని వెల్లడి

## అది ముస్లిం లీగ్‌మావోయిస్టు కాంగ్రెస్

జైపూర్/సనంద్: విపక్ష కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి నిప్పులు చెరిగారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పేసి నిరసన తెలపడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రపంచ దేశాల ఎదుట మనదేశాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి ఏ ఒక్క అవకాశాన్ని కూడా కాంగ్రెస్ వదులుకోవడం లేదని మండిపడ్డారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సీ) నేడు ముస్లింలీగ్‌మావోయిస్టు కాంగ్రెస్(ఎంఎంసీ)గా మారిందంటూ ధ్వజమెత్తారు. ముస్లిం లీగ్ వల్ల భారతదేశం ముక్కలైందని చెప్పారు. నేడు కాంగ్రెస్ కూడా అదే తరహాలో వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. మావోయిస్టుల దారిలోనే నడుస్తూ దేశంపై దాడి చేస్తోందని విమర్శించారు. ప్రధాని మోదీ శనివారం రాజస్తాన్‌లోని అజ్మీర్‌లో పర్యటించారు. రూ.16,600 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. దేశవ్యాప్తంగా జరిగే హ్యూమన్ ప్యాపిలో మా వైరస్(హెచ్‌పీవీ) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించారు. ప్రపంచ దేశాలు మన దేశం గురించి గొప్పగా మాట్లాడినప్పుడు ప్రతి భారతీయుడి హృదయం గర్వంతో ఉప్పొంగిపోతుందని అన్నారు. కానీ, కాంగ్రెస్ మాత్రం విదేశీయుల ఎదుట భారతదేశాన్ని కించపర్చడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఆ పార్టీ ఎన్నికల్లో వరుసగా ఓడిపోతూనే ఉందన్నారు. అది తట్టుకోలేక దేశ ప్రతిష్టను దెబ్బతీస్తూ ప్రతీకారం తీర్చుకుంటోందని దుయ్యబట్టారు. దేశాన్ని కించపర్చడం, సైనిక దళాలను బలహీనపర్చడం కాంగ్రెస్‌కు అలవాటేనని పేర్కొన్నారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అవినీతి, పేపర్ లీక్ వార్తలు నిత్యం వచ్చేవని గుర్తుచేశారు. నేడు రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అద్భుతమైన పాలన అందిస్తోందని, ప్రజలకు ఎనలేని మేలు చేస్తోందని ప్రధాని మోదీ ప్రశంసించారు. నేడు పేపర్ లీక్‌లు లేవని, అవినీతిపరులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టంచేశారు.

## మార్చి 6 నుంచి 99 రోజుల ప్రణాళిక

హైదరాబాద్: ప్రజాప్రభుత్వ పథకాలు.. అభివృద్ధి పనులు, ప్రజోపయోగ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో రాష్ట్రంలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'కార్యక్రమం చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని 99 రోజుల కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తించాలని ఆదేశించారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కార్యక్రమాల షెడ్యూల్‌ను రూపొందించి, వాటిని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక లోగో తయారు చేయాలని సీఎస్‌ను ఆదేశించారు. ఫైళ్లలో ఉన్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో ఫలితాలుగా మారాలని, ప్రజలకు పథకాల ప్రయోజనం ప్రత్యక్షంగా చేరేలా యంత్రాంగం మొత్తం ఒకే లక్ష్యంతో పనిచేయాలని చెప్పారు. ఈ 99 రోజుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్‌తోపాటు రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అన్ని కార్యాలయాల్లో పారిశుధ్యం, పరిశుభ్రత కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఇందుకు ప్రతి శాఖ, ప్రతి జిల్లా, ప్రతి అధికారి మిషన్ మోడ్‌లో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో శనివారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. పురోగతిని స్వయంగా పరిశీలిస్తానని, క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తానని చెప్పారు. అధికారుల పనితీరు లోపాలను సహించబోమని హెచ్చరించారు. ఐఏఎస్ అధికారులే ప్రభుత్వానికి వెన్నెముక అని.. ప్రతి పథకం, ప్రతి పాలసీ విజయం, వైఫల్యం వారిపైనే ఆధారపడి ఉన్నాయన్నారు. మార్చి 4న నిర్వహించే కలెక్టర్ల సమావేశంలో అందరి పని తీరుపై మాట్లాడతానని వెల్లడించారు.

## మాటలకే పరిమితం కాకుండా గ్రౌండింగ్‌కే మా ప్రాధాన్యత

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రస్థానంలో మరో కీలక అడుగు పడింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం సీతపాలెం ఇండస్ట్రియల్ పార్క్‌లో ప్రముఖ ఫార్మా దిగ్గజం 'బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్' (బీజేహెచ్‌ఎల్) గ్రీన్‌ఫీల్డ్ ఔషధ తయారీ యూనిట్‌కు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్ర పారిశ్రామికాభివృద్ధిలో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, పరిశ్రమలు క్షేత్రస్థాయిలో ఏర్పాటయ్యేలా (గ్రౌండింగ్) తమ ప్రభుత్వం శ్రద్ధ వహిస్తోందని స్పష్టం చేశారు.

### ఏపీలో పెట్టుబడులకు మూడు బలమైన కారణాలు

ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడిదారులు తమ గమ్యస్థానంగా ఎంచుకోవడానికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయని లోకేశ్ విశ్లేషించారు.

మొదటిది 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'. ప్రభుత్వంతో ఒప్పందం కుదిరిన మరుక్షణం నుంచి ఆ ప్రాజెక్టును ప్రభుత్వం తమ సొంత ప్రాజెక్టుగా భావిస్తుందని, పెట్టుబడిదారులను బయటివారిలా కాకుండా అభివృద్ధిలో భాగస్వాములుగా చూస్తామని చెప్పారు. రెండవది 'విశ్వసనీయత'. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న నమ్మకమే రాష్ట్రానికి అతిపెద్ద బలమని, ఏపీ ప్రభుత్వం మాట ఇస్తే తప్పక నిలబెట్టుకుంటుందన్న భరోసా పెట్టుబడిదారుల్లో ఉందని అన్నారు. మూడవది 'డబుల్ ఇంజిన్ సర్కార్'. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న బలమైన నాయకత్వం వల్ల నిర్ణయాలు వేగంగా జరుగుతున్నాయని, ప్రాజెక్టులు కాగితాలకే పరిమితం కాకుండా శరవేగంగా కార్యరూపం దాలుస్తున్నాయని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్న ఆసక్తికరమైన నేపథ్యాన్ని మంత్రి వివరించారు. తన సొంత నియోజకవర్గం మంగళగిరికి చెందిన బ్లూ జెట్ సంస్థ సీనియర్ అధికారి వేణుబాబు గతేడాది తనను కలిసినప్పుడు, ఏపీలో ఎందుకు పెట్టుబడులు పెట్టకూడదని ప్రశ్నించారన్నారు. ఆ ఆవేదన, ఆకాంక్ష నుంచే ఈ ప్రాజెక్ట్ పురుడు పోసుకుందని తెలిపారు. వెంటనే సంబంధిత శాఖలను అప్రమత్తం చేసి, రాంబిల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఫేజ్-2లో 102 ఎకరాల భూమిని కేటాయించడమే కాకుండా, అనుమతులన్నీ వేగంగా మంజూరు చేశామని గుర్తుచేశారు. ఒక సామాన్య సంభాషణ నుంచి భూమిపూజ వరకు సాగిన ఈ ప్రయాణం ఏపీ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు.

# బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు

# 20 మంది సజీవ దహనం..



### 20 మంది మృతులు వీరే

వేట్లపాలేనికి చెందిన గంధి మంగ (43), వల్లూరి రవి (35), కడింపల్లి కృపమ్మ, గంపల మంగ, గంపల నాగరాజు, బిక్కిన కరుణ సుబ్బారావు (45), సాధనాల సత్యవేణి (44), గొడతా నాని (26), సంకుమళ్ల రాఘవ (50), ఫైర్వ్ యజమాని అర్జున్ తండ్రి అడబాల శ్రీనివాసరావు (55), దుర్గానగర్‌కు చెందిన తుంపల లోవ (38), నూకెళ్ల దేవి (45), జొన్నలదొడ్డికి చెందిన చింతల రమణ (60), గూడపర్తికి చెందిన మందపల్లి చిన్ని (44), గొడత మహేష్ (41), గొడత వీర వెంకట రమణ (48), కడింపల్లి ధనరాజు (55), కుమ్మరి వీధికి చెందిన దర్శిపాటి నాని (38), యేడిద సంపత్ కుమార్ (25), పెదబ్రహ్మదేవం గ్రామానికి చెందిన మాకర రాఘవమ్మ (55) మృతి చెందారు.

(మొదటి పేజీ తరువాయి)

20 మంది కూలీలు అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. మరో 11 మంది కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. మృతులందరూ పెద్దాపురం నియోజకవర్గం పెద్దాపురం, సామర్లకోట, వేట్లపాలెం, పెదబ్రహ్మదేవం, గూడపర్తి గ్రామాలకు చెందిన వారు. రెక్కాడితే కానీ డొక్కాడని ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారు. సామర్లకోట పెదపూడి రోడ్డును ఆనుకుని పంట పొలాల మధ్య సుమారు మూడెకరాల్లో ఈ బాణసంచా తయారీ కేంద్రం ఉంది. ఉదయం బాణసంచా కేంద్రంలోని నాలుగు షెడ్లలో 60 మంది వరకూ కూలీలు మందు గుండు తయారీలో నిమగ్నమయ్యారు. సహజంగా ప్రతి రోజూ ఈ కేంద్రంలో 1015 మంది పని చేస్తూంటారు. అయితే జగ్గంపేట మండలం మల్లిశాలలో జాతరకు భారీ ఆర్డర్ రావడంతో పాటు పెళ్లిళ్లు కూడా ఎక్కువగా ఉండటంతో బాణసంచాకు డిమాండ్ పెరిగింది. దీంతో 60 మందికి పైగా కూలీలతో పని చేయిస్తున్నారు. రాకెట్లు, జువ్వలు, సెర్చ్‌లైట్లు, మిడతల దండు, డిస్కో బుడ్లు, చిచ్చు బుడ్లు తయారు చేస్తున్నారు. పైగా మల్లిశాలలో జాతర కోసం సిద్ధమైన మందు గుండును కూడా ఇక్కడున్న గోడౌన్‌లోనే నిల్వ చేశారు. మధ్యాహ్నం ఒంటిగంటకు అందరూ భోజనాలకు బయటకు వచ్చారు. 1.30 గంటలకంతా భోజనం ముగించుకున్న కూలీల్లో 3040 మంది తిరిగి ఆ నాలుగు షెడ్లలోకి వెళ్లి పనిలో నిమగ్నం అయ్యారు. మరికొందరు బయటే సేద తీరారు. ఇంకొందరు సమీపంలోనే ఊరు ఉండటంతో భోజనానికి ఇంటికెళ్లి తిరిగి వస్తున్నారు.

### పెద్ద శబ్దం.. ఎగిరిపడ్డ దేహాలు

మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. నాలుగు షెడ్లలో ఉన్న బాణసంచా ఒకదాని తర్వాత మరొకటి పేలిపోవడంతో చెవులు చిల్లులు పడేలా భయంకరమైన శబ్దం వినిపించింది. పేలుడు ధాటికి షెడ్లలో ఉన్న కూలీలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డారు. పేలుడు తీవ్రతకు మృతుల శరీర భాగాలు 2030 అడుగుల ఎత్తున ఎగిరిపడ్డాయి. పెద్ద ఎత్తున చెలరేగిన మంటల్లో కాలిపోయిన మృతదేహాలు తునాతునకలైపోయాయి. శరీరాలు గుర్తు పట్టలేని రీతిలో ఛిద్రమైపోయాయి. కొందరి తలా, మొండెం, కాళ్లు, చేతులు వేర్వేరు ప్రాంతాల్లో, సమీపంలోని పంట కాలువలు, పచ్చని వరి పొలాల్లో దూరంగా పడ్డాయి. క్షణాల్లోనే ఆ ప్రాంతమంతా భీతావహంగా మారిపోయింది. సంఘటన ప్రాంతమంతా మృతులు, క్షతగాత్రుల బంధువుల ఆర్తనాదాలతో హృదయ విదారకరంగా మారింది.

### భీతావహ దృశ్యం

పేలుడు ధాటికి ఘటన స్థలి ఎటుచూసినా మంటల్లో కాలిపోయిన కూలీల మృతదేహాలతో భయానక వాతావరణం కనిపించింది. ఆ సమయంలో పనిలో ఉన్నవారెవరు, ఎంత మంది మృతి చెందారు, ఎవరు మిగిలి ఉన్నారనేది తెలియక గందరగోళ పరిస్థితి నెలకొంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులు, బంధువులు తరలివచ్చారు.

పేలుడు ధాటికి సంఘటన స్థలానికి రెండు కిలోమీటర్ల దూరాన సామర్లకోటరాజమహేంద్రవరం కెనాల్ రోడ్డులో ఉన్న గూడపర్తిలోని ఇళ్లల్లో ఉన్న వారు భూకంపం వచ్చినట్టు భయపడి బయటకు పరుగులు తీశారు. ఇంటిపై ఉన్న ఇనుప రేకుల నుంచి సైతం శబ్దం వచ్చిందని స్థానికులు తెలిపారు. వేట్లపాలెం, గూడపర్తి, పెదబ్రహ్మదేవం, జి.మేడిపాడు గ్రామాలకు పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. కాగా, మృతదేహాలను సేకరించేందుకు స్థానికులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అష్టకష్టాలు పడ్డారు. కాలువలు, చేలల్లో గాలింపు చేపట్టి నుజ్జునుజ్జు అయిన శరీర భాగాలను సేకరించి ఒక చోటకు చేర్చారు. ఏది ఎవరి అవయవమో గుర్తించలేక కొన్నింటిని మూటలు కట్టారు. ఇలా అన్ని మృతదేహాలను, మూటలను అతి కష్టం మీద సామర్లకోట ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

## మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల ఆర్థిక సాయం

కాకినాడలో జరిగిన ఘోర బాణసంచా పేలుడు ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించిన ఆయన, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సీఎం.. మృతుల కుటుంబాలకు రూ. 20 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా తన వంతుగా రూ. 2 లక్షల సాయం అందించిందని తెలిపారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 20 మంది మృతి చెందారని, మరో 9 మంది పరిస్థితి విషమంగా ఉందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల్లో 12 మంది ఎస్సీలు, 9 మంది మహిళలు ఉన్నారని, వీరంతా కేవలం పూట గడవడం కోసం కూలీ పనులకు వెళ్లిన నిరుపేదలని సీఎం గుర్తుచేసుకున్నారు. ఇలాంటి హృదయ విదారక ఘటనలు పునరావృతం కాకూడదని, అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడేవారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బాణసంచా కేంద్రాల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక అధికారుల నిర్లక్ష్యంపై తీవ్రంగా మండిపడ్డ సీఎం చంద్రబాబు.. అక్కడికక్కడే సంచలన నిర్ణయం తీసుకున్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఆర్డీఓ, డీఎస్పీ, డిస్ట్రిక్ట్ లేబర్ ఆఫీసర్, ఫైర్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రెస్ మీట్ ద్వారా ప్రకటించారు. విచారణ ఇంకా కొనసాగుతుందని, ఈ ఘటనకు బాధ్యులైన ఇతర అధికారులపైనా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కేవలం అనుమతులు ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదని, క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే యజమానులపై ఉక్కుపాదం మోపుతామని సీఎం వార్నింగ్ ఇచ్చారు. కొంతమంది విచ్చలవిడితనానికి అలవాటుపడి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని, అటువంటి వారిని అరెస్ట్ చేయడమే కాకుండా ప్రాసిక్యూషన్ చేస్తామన్నారు. అంతేకాకుండా వారి ఆస్తులను జప్తు చేసి, ఆ డబ్బును బాధితులకు అందజేస్తామని స్పష్టం చేశారు.

# భగ్గుమన్న పశ్చిమాసియా

ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ ప్రధాన కార్యాలయ భవనంపై జరిగిన భారీ క్షిపణి దాడులు ఈ వార్తలకు బలం చేకూరుస్తున్నాయి. టెహ్రాన్‌తో పాటు ఇరాన్‌వ్యాప్తంగా పలు నగరాలు పేలుళ్లతో దద్దరిల్లిపోతున్నాయి. టెహ్రాన్‌లో ఎక్కడ చూసినా దట్టమైన పొగ వెలువడుతోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడికి దిగడం 8 నెలల్లో ఇది రెండోసారి. గత జూన్‌లో అవి జరిపిన దాడుల్లో ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు తదితరాలు బాగా దెబ్బతిన్నాయి. అమెరికాతో పూర్తి సమన్వయంతో దాడులు జరుపుతున్నట్టు ఇజ్రాయెల్ పేర్కొంది. ఇరు దేశాల సైన్యం నెలల తరబడి రూపొందించిన వ్యూహం మేరకు దాడులు కొనసాగిస్తున్నట్టు ప్రకటించింది. వీటిలో ఏ మేరకు ప్రాణనష్టం జరిగిందో తెలియరాలేదు. ఇరాన్ కూడా కొద్ది గంటల్లోనే తేరుకుని దీటుగా స్పందిస్తోంది. తొలుత ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఆ వెంటనే బహ్రెయిన్, కువైట్, ఖతార్, యూఏఈల్లోని అమెరికా సైనిక స్థావరాలపై కూడా క్షిపణి దాడులకు దిగింది. కువైట్ విమానాశ్రయంపై డ్రోన్లతో దాడి చేసింది. శనివారం రాత్రి సౌదీ అరేబియా, దుబాయ్‌పైనా క్షిపణుల వర్షం కురిపించింది.

ఈ ఘర్షణలు కనీసం కొద్ది వారాల పాటు కొనసాగుతాయని అమెరికా, ఇజ్రాయెల్ రక్షణ శాఖ వర్గాలను ఉటంకిస్తూ వెలువడుతున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. అదే జరిగితే పరిస్థితులు త్వరలోనే పూర్తిస్థాయి యుద్ధానికి దారి తీయవచ్చంటున్నారు. ఇరాన్‌పై అమెరికా దాడిని విపక్ష డెమొక్రటిక్ పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. కాంగ్రెస్ అనుమతి లేకుండా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా యుద్ధానికి దిగారంటూ మండిపడింది. మరోవైపు ఇరాన్‌కు దన్నుగా తామూ యుద్ధరంగంలోకి దిగుతామని హెజ్బొల్లా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌తో పాటు ఎర్ర సముద్రంలోని రవాణా నౌకలను కూడా తిరిగి లక్ష్యంగా చేసుకుంటామని యెమన్‌కు చెందిన హౌతీ మిలిటెంట్ గ్రూపు పేర్కొంది.

### అణు స్థావరాలపైనా దాడులు

ఇరాన్‌లోని అణు స్థావరాలపై ఇజ్రాయెల్, అమెరికా ముమ్మర దాడులు చేస్తున్నాయి. ఇస్ఫహాన్‌లోని అణు కేంద్రాలు పేలుళ్లతో దద్దరిల్లుతున్నాయి. ప్రధాన క్షిపణుల కేంద్రం తబ్రీజ్‌పైనా భారీ స్థాయిలో దాడులు జరుగుతున్నాయి. టెహ్రాన్, షిరాజ్, తబ్రిజ్‌తో పాటు నౌకా కేంద్రాలైన చాబహార్, బుషెహర్, అసాలుయెతో పాటు కోమ్, కరజ్, కెర్మన్‌షా తదితర నగరాలు కూడా దాడులకు గురయ్యాయి. వాటిమీదుగా వెలువడుతున్న దట్టమైన పొగ దాడుల తీవ్రతకు అద్దం పడుతోంది. దక్షిణ ఇరాన్‌లోని హొర్మోగన్ ప్రావిన్స్‌లో మినాబ్ నగరంలో ఓ బాలికల పాఠశాలపై జరిగిన దాడుల్లో ఏకంగా 85 మందికి పైగా విద్యార్థులు దుర్మరణం పాలైనట్టు ప్రభుత్వ వార్తా సంస్థ పేర్కొంది. మరో 50 దాకా గాయపడ్డట్టు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా మృతుల సంఖ్య 200 దాటిందని, 700 మందికి పైగా గాయపడ్డారని ఇరాన్ పేర్కొంది. ఇరాన్ సైనిక, ప్రభుత్వ, నిఘా కార్యాలయాలను కూడా ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంది. ముఖ్యంగా రక్షణ, అణు స్థావరాలపై పెద్ద సంఖ్యలో క్షిపణి దాడులు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఖమేనీ, ఇతర అగ్ర నేతల నివాసానికి దారితీసే మార్గాలన్నింటినీ మూసేశారు. దేశవ్యాప్తంగా మొబైల్ సేవలను కూడా నిలిపేశారు. ఖమేనీని టెహ్రాన్ నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు చెబుతున్నారు. దాడుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రజలు నగరాలు వీడి సురక్షిత ప్రాంతాలకు తరలుతున్నారు.

# వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం





- యాదాద్రిలో ముగిసిన 11 రోజుల వార్షిక బ్రహ్మోత్సవాలు
- 108 వెండి కలశాలతో ఘనంగా అష్టోత్తర శతఘటాభిషేకం
- ఆగమశాస్త్రం ప్రకారం స్వామివారి అభిషేకం
- ప్రశాంతంగా సాగిన ఉత్సవాలు.. ఊపిరి పీల్చుకున్న అధికారులు



**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్టలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకంతో వైభవంగా ముగిశాయి. గత 11 రోజులుగా సాగిన ఉత్సవాలకు ఈ కార్యక్రమం ముగింపు ఘట్టంగా నిలిచింది. ఉదయం స్వామి అమ్మవార్లకు 108 వెండి కలశాలను పాంచరాత్ర ఆగమశాస్త్ర విధానానుసారం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. కలశాల్లో 108 రకాల ఔషధ ద్రవ్యాలు, వనమూలికలు, పండ్ల రసాలు నింపి వేదమంత్రాల నడుమ పూజలు నిర్వహించారు. అనంతరం పసుపు, కుంకుమ, పుష్పమాలికలతో అలంకరించి అర్చకులు ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. పంచసూక్తాలు, పంచోపనిషత్తులు, దశశాంతులు, చతుర్వేద పారాయణాల మధ్య సుమారు మూడు గంటలపాటు స్వయంభూ మూర్తులకు అభిషేకం జరిగింది. దేవస్థానం చైర్మన్ నరసింహమూర్తి, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఈఓ భవాని శంకర్ తదితరులకు కంకణధారణ చేయించి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు ధరింపజేసి పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ దౌర్భాల భాస్కర శర్మ, ఏఈఓ రఘు, అధికారులు నటరాజ్, సీతారామాచార్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.






## విద్యార్థులే పాలకులు.. పారుపల్లి బడిలో స్వపరిపాలన వేడుక

- అధికారుల పాత్రలో ఒదిగిపోయిన పదో తరగతి విద్యార్థులు
- పారుపల్లి ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**రాజాపేట, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** రాజాపేట మండలం పారుపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు వివిధ హోదాలలో అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు స్వీకరించి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రిగా మహావీర్ చంద్ర, విద్యాశాఖ మంత్రిగా గిరెడ్డి స్నేహ, ఎమ్మెల్యేగా వైష్ణవి, అదనపు కలెక్టర్లుగా అజయ్, శ్రావిక, నందిని, ఎంపీగా రుచిత, డీఈవోగా అనూష, ఎంఈఓగా భాను, ఎంపీడీవోగా అవంతిక, సర్పంచిగా సాయికిరణ్, ఎమ్మార్వోగా భావన, పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా భవ్య తదితరులు బాధ్యతలు నిర్వహించారు. మిగిలిన విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలు పోషించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృపా ప్రచారిణి, రాంప్రసాద్, రవళి, నర్మద, రజిని తదితరులు పాల్గొన్నారు.

## గ్రహణం వేళ.. మైసమ్మ ఆలయం మూసివేత



**చౌటుప్పల్, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్) :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ పరిధిలోని శ్రీ ఆందోళ్ మైసమ్మ దేవస్థానంలో మంగళవారం చంద్రగ్రహణం కారణంగా ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్.మోహన్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణం సందర్భంగా మంగళవారం ఉదయం 7 గంటలకు ఆరాగింపు నిర్వహించిన అనంతరం ద్వారబంధనం (ఆలయ తలుపులు) చేస్తామన్నారు. గ్రహణం ముగిసిన తర్వాత మరుసటి రోజు బుధవారం ఉదయం 7 గంటలకు సంప్రోక్షణ నిర్వహించి, అనంతరం భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## శ్రీగిరి క్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవ వేడుకలు

- వైభవంగా చక్రస్నానం.. కన్నులపండువగా పుష్పయాగం
- మహా పూర్ణాహుతితో ముగిసిన వార్షిక ఉత్సవాలు
- శ్రీగిరి క్షేత్రంలో మిన్నంటిన గోవింద నామస్మరణ
- భక్తిశ్రద్ధలతో ధ్వజ అవరోహణ క్రతువు
- విజయవంతం చేసిన భక్తులకు ట్రస్టు సభ్యుల కృతజ్ఞతలు
- విద్యుత్ కాంతులతో శోభాయమానంగా ఆలయ పరిసరాలు



**రాజపేట, ఫిబ్రవరి 27 (తొలివెలుగు):** రాజపేట మండలం రేణికుంట శివారులోని శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు మహా పూర్ణాహుతి, శ్రీ పుష్పయాగం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో ఉత్సవాలు వైభవంగా సమాప్తమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాలు ఆరాధన సేవ, కాలం నివేదన, తీర్థప్రసాద గోష్టి, శాంతిపాఠం, చతుస్థానార్చన, శ్రీ సుదర్శన నరసింహ ద్వారా బలిహరణ, పూర్ణాహుతి, మూర్తి కుంభ ఉద్వాసన, అష్టోత్తర శతకలశ స్థాపన, మూర్తి కుంభ ప్రోక్షణ, చక్రస్నానం, నివేదన, మంగళశాసనం తదితర వైదిక కర్మలతో కొనసాగాయి. అనంతరం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, దేవతోద్వాసనం, ద్వాదశ ఆరాధన, శ్రీ పుష్పయాగం, సతాహరణ, ధ్వజావరోహణ, మహదాశీర్వచనం, రుత్విక్ సన్మానం నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ ట్రస్ట్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడంపై నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. ట్రస్ట్ సభ్యులు వట్టం రాఘవేందర్ గుప్త, కూర బద్రీనాథ్ గుప్త, సూది రెడ్డి నాగిరెడ్డి, సమ్మెట శ్రీనివాసరావు, ఎల్లారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలు, పచ్చని తోరణాలు, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం ఉత్సవ వాతావరణంలో కళకళలాడింది.





## గట్టెక్కనున్న మదర్ డైరీ!

- మదర్ డైరీకి పునరుజ్జీవం: ఎన్‌డీడీబీతో ఒప్పందానికి సర్కార్ సానుకూలత
- రైతు ముంగిటికి మదర్ డైరీ: బకాయిల చెల్లింపునకు లైన్ క్లియర్!
- 500 మంది ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు: చైర్మన్ గుడిపాటి కృషితో సఫలం
- ప్రైవేట్ డైరీలకు దీటుగా మదర్ డైరీ లక్ష్యం: పాలకవర్గం స్పష్టం

**రాజపేట, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** ఆర్థిక ఇబ్బందులతో పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన మదర్ డైరీ పునరుద్ధరణ దిశగా కీలక ముందడుగు పడింది. చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి ప్రత్యేక చొరవతో డైరెక్టర్లతో కలిసి చేసిన కృషి ఫలించి, సంస్థకు ఊపిరి పోసే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను కలిసి మదర్ డైరీ సమస్యలపై చర్చించిన అనంతరం, ఎన్‌డీడీబీతో ఒప్పందానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. దీంతో సంస్థ పునరుజ్జీవానికి మార్గం సుగమమైంది. ఈ పరిణామంతో మదర్ డైరీలో పనిచేస్తున్న సుమారు 500 మంది ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు భరోసా కలిగింది. వేలాది పాడి రైతుల పెండింగ్ బకాయిల చెల్లింపుకు కూడా లైన్ క్లియర్ అయినట్లు సమాచారం. ఉమ్మడి రెండు జిల్లాల రైతులకు ఇది ఊరటనిచ్చే పరిణామంగా భావిస్తున్నారు. ముందు రోజుల్లో సబ్సిడీపై పశుదాణా, మందులు అందించడంతో పాటు మార్కెటింగ్ రంగంలో ప్రైవేట్ డైరీలకు దీటుగా పోటీ పడేలా సంస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పాలకవర్గం చర్యలు చేపడుతోంది. గతంలో పాలు సరఫరా చేసిన రైతులు తిరిగి మదర్ డైరీ వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయని వర్గాలు పేర్కొంటున్నాయి. సంస్థ పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి నాయకత్వంలో పాలకవర్గం ముందుకు సాగుతోందని, పాడి రైతుల కుటుంబాలకు భరోసా కల్పించే నిర్ణయాలు త్వరలో అమలులోకి రానున్నాయని సమాచారం. దీంతో మదర్ డైరీ భవిష్యత్తుపై ఆశావహ వాతావరణం నెలకొంది.



# మాంటిసోరి పాఠశాలలో ఘనంగా విజ్ఞాన దినోత్సవం

- ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు
- శాస్త్రీయ దృక్పథంతోనే ప్రగతి: మాంటిసోరి పాఠశాల యాజమాన్యం





**రాజపేట, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మాంటిసోరి హై స్కూల్‌లో శనివారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ప్రముఖ శాస్త్రవేత్త సీ.వీ. రామన్ సేవలను స్మరించుకున్నారు. విద్యార్థులు ప్రత్యేక సభలో పాల్గొని శాస్త్ర ప్రదర్శన నిర్వహించారు. వివిధ సృజనాత్మక నమూనాలు, చిన్న ప్రయోగాలను ప్రదర్శిస్తూ తమ శాస్త్రీయ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనాత్మక ఆలోచన, ఆవిష్కరణ భావన పెంపొందేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. శాస్త్ర విజ్ఞానం సమాజ పురోగతికి పునాది అని, విద్యార్థులు ప్రశ్నించే స్వభావం అలవర్చుకోవాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ కార్యక్రమం ముగిసింది.

# సీసీ కెమెరాల నిఘాలో 'జాలా'



**రాజపేట, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండలంలోని జాలా గ్రామంలో భద్రతా చర్యలను బలోపేతం చేసే క్రమంలో శనివారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో ఈ కెమెరాలను ప్రతిష్ఠించినట్లు గ్రామపంచాయతీ వర్గాలు తెలిపాయి. గ్రామ అభివృద్ధి, ప్రజల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల ఏర్పాటు కీలకమని సర్పంచ్ గంధమల్ల నవనీత పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు నరసారెడ్డి మోహన్ రెడ్డి, సురేందర్ రెడ్డిలను ఉపసర్పంచ్ కొల్లూరు లావణ్య కరుణాకర్, వార్డు సభ్యులు బత్తుల బాలయ్య, కొండ ముత్తం రెడ్డి అభినందించారు. గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు ఈ చర్య దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పారుపల్లి సత్తిరెడ్డి, గుంటి భీష్మారెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# యాద్రీశుడిని దర్శించుకున్న త్రిపుర గవర్నర్

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి శనివారం ఉదయం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా క్షేత్రానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు సాదరంగా పూలమాలలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భాలయంలో స్వామి, అమ్మవార్లకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనం అనంతరం ముఖ మండపంలో వేద పండితులు ఆయనకు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వచనం చేయగా, అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, డీఈఓ దోర్బాల భాస్కర్ శర్మ, ఈఓ భవాని శంకర్, ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యులు, మాధవాచార్యులు, శ్రీనాథాచార్యులు, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# సృజనాత్మకతతోనే నూతన ఆవిష్కరణలు

- రామన్ ఎఫెక్ట్ స్ఫూర్తితో సాగాలి
- ఎంజేపీటీలో విద్యార్థుల మేధోమథనం.. ఆకట్టుకున్న వైజ్ఞానిక నమూనాలు
- నిజజీవితంతో ముడిపెట్టి చదివితేనే ఆవిష్కరణలు సాధ్యం
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 'రోబో' ప్రదర్శన
- ఎంజేపీటీ కళాశాల ప్రిన్సిపల్ బి. శిరీష



**చౌటుప్పల్, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్రంపై ఆసక్తి పెంపొందించుకుని సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలని ఎంజేపీటీ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ బి. శిరీష అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట గ్రామ పరిధిలోని ఎంజేపీటీ పాఠశాల, కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1928 ఫిబ్రవరి 28న "రామన్ ఎఫెక్ట్"ను ప్రపంచానికి పరిచయం చేసి, 1930లో నోబెల్ బహుమతి అందుకున్న ఆయన జీవితం విద్యార్థులకు ఆదర్శమని పేర్కొన్నారు. పాఠ్యాంశాలను నిజజీవితంతో అనుసంధానించి పరిశోధనాత్మక దృక్పథంతో అభ్యసించాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. రోజువారీ జీవితంలో జరిగే అంశాలను ప్రశ్నించే స్వభావం పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థి దశలోనే మెదడుకు పదును పెట్టి జ్ఞానాన్ని పెంపొందించుకుంటే అబ్దుల్ కలాం వంటి మహానుభావులుగా ఎదగవచ్చున్నారు. సైన్స్ ఫెయిర్‌ల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనశాలను సందర్శించి అభినందించారు. విద్యార్థులు రూపొందించిన "రోబో" ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.









# ఇంద్రసేనారెడ్డికి బీజేపీ శ్రేణుల సత్కారం!

- గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాజపేట నాయకులు

**రాజపేట, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని శనివారం రాజపేట మండల భాజపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామివారి దర్శనం నిమిత్తం యాదగిరిగుట్టకు వచ్చిన ఆయనను జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనతో ప్రస్తుత రాజకీయ అంశాలపై ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో రాజపేట సర్పంచ్ కోయ మధు, మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కాయతి బాల్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి బింగి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు వద్దు.. అంగన్వాడీ ముద్దు

- గోలిగూడెం అంగన్వాడీలో చిన్నారులకు అక్షరాభ్యాసం
- అంగన్వాడీ సేవలను వినియోగించుకోండి: సూపర్వైజర్ ధనమ్మ

**వలిగొండ, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లా వలిగొండ మండలం పులిగిల్ల గ్రామ పరిధిలోని మధిర గోలిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారుల విద్యా ప్రస్థానానికి శుభారంభంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపర్వైజర్ ధనమ్మ హాజరై చిన్నారులకు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ పాఠశాలలపై ఆధారపడకుండా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, దుస్తులు, ఆటవస్తువులు, ప్రాథమిక విద్యా బోధన వంటి సౌకర్యాలను సమగ్రంగా అందిస్తున్నదని తెలిపారు. రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చిన్నారులకు సమగ్ర సంరక్షణతో పాటు మెరుగైన ప్రాథమిక విద్య అందుబాటులో ఉంటుందని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పుణ్యవతి, వలిగొండ సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది, గోలిగూడెం వార్డు సభ్యులు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.





# విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

- తాజ్‌పూర్ పాఠశాలలో ఘనంగా సైన్స్ ఫేర్
- టీచర్ల కొరత తీరుస్తాం: సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్

**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే సైన్స్ ఫేర్ల ప్రధాన ఉద్దేశమని తాజ్‌పూర్ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తాజ్‌పూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేటుకు దీటుగా ఆత్మవిశ్వాసంతో ప్రాజెక్టులను వివరించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో పరిశోధనా తత్వాన్ని పెంపొందించేందుకు ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడంలో తల్లిదండ్రులు మరింత చొరవ చూపాలని, ప్రదర్శనకు తక్కువ సంఖ్యలో హాజరుకావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి నరేందర్ నాయక్, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, బొమ్మరపు లక్ష్మీ బాల్రాజ్, ఎస్.కె గాలిబ్ యాకుబ్, ఎస్.కె హైమద్, వరిగంటి మానస నాగరాజు, గ్రామ ప్రజలు, అగ్రికల్చర్ విద్యార్థులు, యాదాద్రి మెడికల్ కాలేజ్ వైద్యులు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


## హైకోర్టు తీర్పును తక్షణమే అమలు చేయాలి

- ఉద్యమకారుల బిల్లుతో ప్రభుత్వ విశ్వసనీయత పెరుగుతుంది
- కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలి
- టీయూజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి: సంగిశెట్టి క్రిస్టఫర్



**వలిగొండ, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను గుర్తించి హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని టీయూజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మలిదశ ఉద్యమకారులకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెలలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ ఉద్యమకారుల బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమకారుల బిల్లును ప్రవేశపెట్టి, నిజమైన ఉద్యమకారులను అధికారికంగా గుర్తిస్తే ప్రభుత్వం పై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించి వారికి గౌరవం కల్పిస్తే మరో పది సంవత్సరాలు అధికారంలో కొనసాగడం ఖాయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల కృతజ్ఞత సదస్సును జయప్రదం చేయండి



**వలిగొండ, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్) :** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కమిటీ వేయడాన్ని హర్షిస్తూ మార్చి 1న నిర్వహించే కృతజ్ఞత సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య పిలుపునిచ్చారు. శనివారం వలిగొండ మండల కేంద్రంలో ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారుల సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇందుకు కృతజ్ఞతగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీమ శ్రీనివాస్ పిలుపు మేరకు ఆదివారం నిర్వహించే సభకు 33 జిల్లాల ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, కార్యదర్శి కదిరేని స్వామి, జిల్లా సాంస్కృతిక శాఖ కన్వీనర్ మల్లం వెంకటేశం, కొండూరు శ్రీరాములు, కన్నెకంటి శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

## భావి శాస్త్రవేత్తల తొలి అడుగులు!

- జాతీయ విజ్ఞాన దినోత్సవానికి ప్రత్యేక వేడుకలు
- భావి శాస్త్రవేత్తలకు ప్రోత్సాహం తెలిపిన యాజమాన్యం
- శాస్త్రీయ ఆలోచనలకు పదును పెట్టిన ప్రదర్శనలు
- తల్లిదండ్రులను ఆకట్టుకున్న విద్యార్థుల ప్రాజెక్టులు
- పాఠశాల చైర్‌పర్సన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** ప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త సి.వి. రామన్ 1928 ఫిబ్రవరి 28న ఆవిష్కరించిన "రామన్ ఎఫెక్ట్"కు గాను నోబెల్ బహుమతి అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని శనివారం చౌటుప్పల్ పట్టణ పరిధిలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏ.పి.జె. అబ్దుల్ కలాం, ఎం.ఎస్. స్వామినాథన్, ఎల్లాప్రగడ సుబ్బారావు, ఐజాక్ న్యూటన్, లూయీ పాశ్చర్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, మేడం క్యూరీ, సునీత విలియమ్స్ వంటి ప్రముఖ శాస్త్రవేత్తల వేషధారణలో హాజరై వారి జీవిత విశేషాలు, ఆవిష్కరణల ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా విద్యార్థులు స్వయంగా రూపొందించిన సైన్స్ నమూనాలు, ప్రాజెక్టులను పాఠశాల ఆవరణలో ప్రదర్శించి, వాటి తయారీ విధానం, ఉపయోగాలు, పనిచేసే తీరును స్పష్టంగా వివరించారు. ఈ ప్రదర్శన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆకట్టుకుంది. పాఠశాల చైర్‌పర్సన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి ప్రదర్శనను సందర్శించి విద్యార్థులను ప్రశంసించారు. పాఠశాల డైరెక్టర్ ఎస్. లక్ష్మీ మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగంలో కొత్త ఆవిష్కరణలు మానవాళి అభ్యున్నతికి దోహదపడాలని, ఈ చిన్నారుల నుంచే భావి భారత శాస్త్రవేత్తలు వెలుగొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులను సన్మానించి, సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొనగా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



# అదరగొట్టిన చిట్టి శాస్త్రవేత్తలు!

- ఏఐ విన్యాసాలతో అబ్బురపరిచిన ట్రినిటీ విద్యార్థులు
- హైవే భద్రతపై వినూత్న ప్రయోగాలు
- ప్రైవేట్ పాఠశాలలకు ఆదర్శం: మున్సిపల్ ఛాంబర్ చైర్మన్ రాజు
- ఏఐ నమూనాలను తిలకించిన ఎంఈఓ గురువారావు
- చంద్రయాన్ నమూనాలు ప్రత్యేకాకర్షణ
- తరలివచ్చిన విద్యావేత్తలు, పుర ప్రముఖులు



**చౌటుప్పల్, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** ప్రపంచ అత్యుత్తమ పురస్కారమైన నోబెల్ బహుమతిని 1930లో అందుకున్న శాస్త్రవేత్త సీ.వీ. రామన్ 1928 ఫిబ్రవరి 28న కనుగొన్న "రామన్ ఎఫెక్ట్" సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ట్రినిటీ విద్యాసంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి గురువారావు, తెలంగాణ మున్సిపల్ ఛాంబర్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బాలబాలికలు ప్రదర్శించిన ఏఐ ఆధారిత పరికరాలు, శాస్త్రీయ నమూనాలను వారు పరిశీలించి ప్రశంసించారు. వ్యవసాయ రంగంలో ఏఐ వినియోగంతో తక్కువ ఖర్చుతో ప్రకృతికి అనుకూలంగా పంటలను సాగు చేసే విధానం, మొబైల్ యాప్ ద్వారా భూసార విశ్లేషణ, అవసరమైన ఖనిజాలు - పోషకాలను గుర్తించి సమయానుకూలంగా పంటలకు అందించే విధానాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా చూపించి ఆకట్టుకున్నారు. రోడ్ సేఫ్టీకి సంబంధించిన ఏఐ పరికరాలు, డ్రైవర్ లేకుండానే గమ్యస్థానానికి చేరుకునే వాహన నమూనాలు, హెల్మెట్ - సీట్ బెల్ట్ వినియోగాన్ని గుర్తించి హెచ్చరికలు జారీ చేసే సాంకేతిక పరిజ్ఞానం, రెండు రోబోలు ఫుట్‌బాల్ ఆడే ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఐఐటీ విద్యార్థులతో పోటీపడే స్థాయిలో ఈ పరికరాలను రూపొందించడం గమనార్హమని అతిథులు పేర్కొన్నారు. అంతేకాక అంతరిక్ష రంగానికి చెందిన చంద్రయాన్ నమూనాలు సహా పలు శాస్త్రీయ ప్రయోగాలు సందర్శకులను అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా మండల విద్యాధికారి గురువారావు మాట్లాడుతూ.. ఇలాంటి ఏఐ ఆధారిత విద్యా ప్రదర్శనలు నిర్వహించడం గర్వకారణమని, ఇతర పాఠశాలలు కూడా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ ఛాంబర్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు మాట్లాడుతూ.. పట్టణంలోని ఇతర పాఠశాలలు, ప్రముఖులను ఆహ్వానించి ఉంటే విద్యార్థుల ప్రతిభ మరింత విస్తృతంగా తెలియజేయవచ్చని అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్, డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల అధ్యక్షత వహించారు. మాలిక్, సంధ్యారాణి, శ్రీవాణి, నీరజ, లక్ష్మీప్రియ, మౌనిక, ప్రత్యూష, ఏఐ బోధకురాలు నందిని, లక్ష్మణ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.








# శ్రీ చైతన్యలో ఘనంగా సైన్స్ ఎక్స్‌పో








- చిన్నారుల సృజనకు వేదిక.. సైన్స్ ఎక్స్‌పో
- చౌటుప్పల్ శ్రీ చైతన్య పాఠశాలలో అద్భుత ప్రయోగాలు
- ప్రదర్శనలను తిలకించిన ఎంఈవో గురువరావు

**చౌటుప్పల్, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్) :** చౌటుప్పల్‌లోని శ్రీ చైతన్య స్కూల్ బ్రాంచ్‌లో విజ్ఞాన ప్రదర్శన (సైన్స్ ఎక్స్‌పో) ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చౌటుప్పల్ మండల విద్యాధికారి ఈ. గురువరావు హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. గౌరవ అతిథులుగా దిల్‌సుఖ్‌నగర్ జోన్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం. వెంకరెడ్డి, హైస్కూల్ కోఆర్డినేటర్ ఏ. రఘువంశి, ప్రైమరీ కోఆర్డినేటర్ పి. కామేశ్వరి, ప్రీ-ప్రైమరీ కోఆర్డినేటర్ ప్రీతీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ.. ఈ. గురువరావు విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడానికి ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు రూపొందించిన శాస్త్రీయ నమూనాలు, ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో ప్రతిభ చాటాలని సూచించారు. ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగిన విజ్ఞాన ప్రదర్శన విజయవంతంగా ముగిసింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వేత బన్స్, అకాడెమిక్ డీన్ దుర్గాప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె. గోపి, ప్రైమరీ ఇన్‌చార్జ్ పరమేశ్వరి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ జ్యోతి రమేష్ గౌడ్‌ను సన్మానించిన ఫోటోగ్రాఫర్లు

- వార్డు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్ష

**చౌటుప్పల్, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించిన ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్‌ను చౌటుప్పల్ మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు ఆమెకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ.. ప్రజల ఆశయాలకు అనుగుణంగా సేవలందిస్తూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. జ్యోతి రమేష్ గౌడ్ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఆదర్శ ప్రజాప్రతినిధిగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రోజు యజ్ఞమాచారి, జిల్లా సలహాదారులు విశ్వనాథ్ చంద్రశేఖర్, మండల అధ్యక్షులు తోర్పునూరి సాయిలు గౌడ్, సహాయ కార్యదర్శి రోషణ రాఘవేంద్ర గౌడ్, చింతల గణేష్, కందగట్ల కృష్ణ, దోర్నాల వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.







## జాతీయ విజ్ఞాన దినోత్సవం హైస్కూల్ లో వేడుకలు

**(తొలివెలుగు న్యూస్):** మేడ్చల్‌మాల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ మండలం ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ వివిధ శాస్త్రీయ నమూనాలను తయారు చేశారు. విద్యార్థుల ప్రదర్శనలు బ్యాటరీలతో నడిచే వాహనం నమూనా వాటర్ ఫిల్టర్ తయారీ విధానం మానవ అవయవాల పని విధానాల వివరణ నీటితో కరెంట్ వెలుగు చూపించే ప్రయోగం పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన విద్యార్థులు తమ ప్రాజెక్టుల ద్వారా విజ్ఞానం మన దైనందిన జీవితంలో ఎంత ముఖ్యమో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో ధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజ్ఞానం పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ఉపాధ్యా యులు అభిప్రాయపడ్డారు. జాతీయ విజ్ఞాన దినోత్సవం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఒక గొప్ప వేదిక. శామీర్‌పేట్ హైస్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల సృజనాత్మకతను ప్రతిబింబించింది

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రామన్నపేట ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** విద్యుత్ నూతన లైన్ ఏర్పాటు చేయడం కోసం రామన్నపేట మండలం తుమ్మలగూడెం సబ్ స్టేషన్ పరిధి లోగల భోగారం,సిరిపురం మరియు తుమ్మలగూడం గ్రామాల 24 ఫ్రతీం సప్లై,అలాగే తుమ్మలగూడం,నిధానపల్లి, భోగారం వ్యవసాయ విద్యుత్ సప్లై లక్ష్మాపురం సబ్ స్టేషన్ పరిధిలో గల లక్ష్మాపురం,శోభనాద్రిపురం, నీర్నెంల గ్రామాలలో సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ వ్యవసాయ విద్యుత్ సప్లై,రామన్నపేట టౌన్ లోనీ విద్యుత్ సబ్ స్టేషన్ నుండి అంబేద్కర్ బొమ్మ వరకు సింగిల్ ఫేజ్ మరియు త్రీ ఫేజ్ మార్చి ఒకటవ తేదీ,ఆదివారం ఉదయం 11 గంటల నుండి 5గంటల వరకు విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుంది.కావున విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని విద్యుత్ శాఖ ఏఈ యం.కోటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు

## ఇంటర్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి: కలెక్టర్ కె. హైమావతి.



**సిద్దిపేట,ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** మిరుదొడ్డి మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటర్మీడియట్2026 బోర్డు మార్గదర్శకాల ప్రకారం పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా చర్యలు తీసుకోవాలని చీఫ్ సూపరింటెంట్‌ను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో విజిటర్ రిజిస్టర్‌లో సంతకం చేసి మిగతా పరీక్షలు కూడా సజావుగా కొనసాగించేలా చూడాలని తెలిపారు. కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదని, పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహించిన తరువాత మాత్రమే లోపలికి అనుమతించాలని ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు కలెక్టర్ సూచించారు.

## పీహెచ్‌సీపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ: కలెక్టర్ కె హైమావతి.

**సిద్ధిపేట,ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** మీరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్ ఉదయం 10.15 గంటలైనా మెడికల్ ఆఫీసర్ సమీన సుల్తానా, ల్యాబ్ టెక్నీషియన్ రవీందర్ విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీల్డ్ విజిట్‌కు వెళ్లే సిబ్బంది తప్పనిసరిగా ఏ గ్రామానికి వెళు తున్నారో ఆసుపత్రిలో సమాచారం అందించాలని సూచించారు. గైర్హాజరు సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓను ఫోన్ ద్వారా ఆదేశించారు. సిబ్బంది సకాలంలో ఆసుపత్రికి విచ్చేసి



విధులను సక్రమంగా నిర్వహించాలని, రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జ్వరంతో



ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడిన కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం పొందాలని, మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు.

## సుదీర్ఘ సేవలందించిన పోలీస్ అధికారులకు ఘన సత్కారం

- సమాజ శ్రేయస్సు కోసం పనిచేసేది పోలీసులే
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖనిఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** తమ కుటుంబ క్షేమం కన్నా సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమేనని,ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులు ఇకనుంచి వారి కుటుంబాల కోసం ఎక్కువ సమయం కేటాయించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు.రామగుండం పోలీస్ కమిషనరేట్లో సుధీర్ఘకాలంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం ఘనంగా సత్కరించారు.పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు ఎస్సై నక్క శామ్యూల్ పాల్ సీసీఎస్ మంచిర్యాల,ఎస్సై నూనే శ్రీనివాస్ మందమర్రి ఏ ఎస్ ఐ హెచ్ వెంకటేష్ బాబు గోదావరిఖని వన్ టౌన్,ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎండి అలీముద్దీన్ సి ఏ ఆర్ రామగుండం,హెడ్ కానిస్టేబుల్ ఎం విజేందర్రెడ్డి జూలపల్లి ని పోలీస్ కమిషనర్ పూలమాలలతో ఘనంగా సత్కరించడంతో పాటు జ్ఞాపికలను అందజేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తమ కుటుంబ క్షేమంకన్నా సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమేనన్నారు.ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులు వారి విధి నిర్వహణ సమయంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవడంతోపాటు కొన్ని సమయాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించిన వారున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్,ఏఓ శ్రీనివాస్,ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్,ఆర్ ఐ లు శేఖర్, మల్లేశం,రామగుండం పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్ల కుంట పోచలింగంతో పాటు పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం వైపు దృష్టిని సారించాలి

**రామన్నపేటఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** :రామన్నపేట మండల కేంద్రంలోని డోన్ బోస్కో హైస్కూల్లో శనివారం సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ ఆవిష్కరణలు ప్రయోగాలను ప్రదర్శించారు. పర్యావరణ రహిత ప్రయోగాలు సౌరశక్తి విద్యుత్ ఉపకరణాలు ఎగ్జిబిషన్ లో




ప్రదర్శించారు.తోటి విద్యార్థులకు ప్రాజెక్టులపై వివరించారు.విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వైపు దృష్టిని సారించాలని,జ్ఞానాన్ని పెంచుకోవాలని కరస్పాండెంట్ పిజీవి చిట్టిబాబు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏడి పి జనార్ధన్ రావు,స్కూల్ టీచర్స్ అనిల్ కుమార్,నవీన్ కుమార్,సయ్యద్ ఖదీర్,హీన,విజయలక్ష్మి, హిరన్మయి,మత్స్యగిరి,సుజాత, శ్రీకాంత్,జోజప్ప, సునీత, వెంకట్ కాంబ్లే,మహాలక్ష్మి, సుమ,జువేరియా,మాధవి, విజయ్ కుమార్,శ్రీలత, అశ్విని,ేంప్మ,రమేష్, వెంకన్న, లింగస్వామి,శ్రీరామ్, నర్సయ్య,లక్ష్మీ,సబిత,అండాలు విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యారంగంలో సరికొత్త అధ్యాయం

- దుబ్బకాలువ రోడ్డుపై నిర్మాణానికి శ్రీకారం
- జిల్లా అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొననున్న కార్యక్రమం
- భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన వేదిక
- నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా రానున్న ప్రజలు
- అధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లు
- సభతో రాజకీయ వేడి పెరుగుదల

**మునుగోడు/చౌటుప్పల్, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని దుబ్బకాలువ గ్రామానికి వెళ్లే రోడ్డుపై నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూమిపూజ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఉదయం 11 గంటలకు జిల్లా ఉన్నతాధికారులతో కలిసి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి భూమిపూజ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. భూమిపూజ అనంతరం భారీ ప్రజాసభను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. వేలాది మంది హాజరుకానున్న నేపథ్యంలో విస్తృత స్థాయిలో వేదిక, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమ ఏర్పాట్లను మునుగోడు ఇంచార్జ్ తహసీల్దార్ నరేష్‌తో పాటు స్థానిక నాయకులు పరిశీలించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సభ నేపథ్యంలో నియోజకవర్గంలో రాజకీయ చర్చలు వేడెక్కుతున్నాయి.



## పట్టా పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి: ఏడిఏ కాంపాటి మల్లయ్య

**దౌల్తాబాద్‌ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** దుబ్బాక డివిజన్ పరిధిలో పట్టా పాస్‌బుక్ కలిగిన ప్రతి రైతు విధిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని దుబ్బాక డివిజన్ ఏడిఏ కాంపాటి మల్లయ్య తెలిపారు. శనివారం దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ ఫోన్‌తో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆధార్ ద్వారా దేశంలోని ప్రతి పౌరుడికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చినట్లే, ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్య కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భూమి కలిగిన ప్రతి రైతు తన భూములకు సంబంధించిన పూర్తి వివరాలతో ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. ముఖ్యంగా పీఎం కిసాన్ లబ్ధిదారులు తదుపరి విడత ప్రయోజనం పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి అని స్పష్టం చేశారు. దూర ప్రాంతాల్లో ఉన్న రైతులు సమీప మీ సేవా కేంద్రాల్లో కూడా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంజ స్వామి, ఏఈవో సంతోష్ కుమార్, కార్యదర్శి హంసకేతన్, రైతులు పాల్గొన్నారు.





## టైలర్ల సంక్షేమానికి సర్కారు చొరవ చూపాలి

- టైలర్లకు ఉచిత విద్యుత్, భీమా కల్పించాలి
- జాతీయ రహదారిపై అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ
- 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలి
- చౌటుప్పల్‌లో జాతీయ విజ్ఞాన దినోత్సవ ర్యాలీ
- అసోసియేషన్ అధ్యక్షుడు మార సంగమేశ్వర్



**చౌటుప్పల్, ఫిబ్రవరి 28 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని చౌటుప్పల్ జెంట్స్, లేడీస్ టైలరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ విజ్ఞాన దినోత్సవం పురస్కరించుకుని జాతీయ రహదారి వెంబడి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మార సంగమేశ్వర్ మాట్లాడుతూ.. టైలర్లకు ఉచిత విద్యుత్, ఉచిత భీమా, హెల్త్ కార్డులు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. అలాగే 50 సంవత్సరాలు నిండిన టైలర్లకు పెన్షన్ కల్పించాలని, ఇండ్లు, ఇళ్ల స్థలం లేని వారికి ప్రభుత్వం భూమి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ అధ్యక్షుడు ఆదిమూల శంకర్, రాపాల ఈశ్వర్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వనమాన దశరథ, ప్రధాన కార్యదర్శి గుంటి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి సురం భూమయ్య, గౌరవ సలహాదారు కొంగరి కనకయ్య, సింహారం కృష్ణ, కొక్కుల భగత్, కార్యవర్గ సభ్యులు దశరథ, మోహన్, నర్సింహం, రాఘవేందర్, గణేష్, భాస్కర్, రవి, ప్రసాద్, విజయ్, బాలాజీ, వెంకటేష్, శీను తదితరులు పాల్గొన్నారు.

